క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ శశిధర్ రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ఊరు రామకృష్ణాపూర్ రోడ్డు పక్కన గల మైదానంలో శనివారం గుడికందుల అనీల్ మెమోరియల్ పట్టణ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్సై మల్లేష్, టోర్నమెంట్ నిర్వాహకులు గుడికందుల రమేష్, శేఖర్, మధుకర్, మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

'పాదయాత్ర' విజయవంతం చేయండి

భీమారం: చెన్నూర్ నుంచి భీమారం సమీపంలోని జోడువాగుల వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టే పాదయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొడెంకి చందు కోరారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల– చెన్నూర్ జాతీయ రహదారిలో భీమారం జోడువాగుల వద్ద ఇరుకు వంతెనతో పాటు ధ్వంసమైన రోడ్డుతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ విషయంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అటవీశాఖ అనుమతుల పేరుతో పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. సంవత్సరాలు గడుస్తున్నా పనులు చేపట్టడం లేదని, ఇందుకు నిరసనగా పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు హాజరుకావాలని కోరారు.

ఆస్తి పన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్

తాండూర్: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నును ప్రజలు సకాలంలో చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. ఇంటి పన్ను వసూలు కోసం వారం రోజుల పాటు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేశారు. వారం రోజుల్లోపు ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను బకాయిలతో సహా చెల్లించాలని, లేని పక్షంలో గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

కరెంట్ కటకట..!





నా పేరు చింత విగ్నేష్. మాది గొల్లపల్లి గ్రామం. నేను ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేశాను. లో ఓల్టేజీ సమస్యతో పంపు మోటారు పనిచేయట్లేదు. దీంతో పొలానికి నీరందక మొత్తం ఎండుతోంది. 100కేవీ డీటీఆర్ ఉన్నా ఉపయోగం లేకుండా ఉంది. కరెంట్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కరించడం లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలే.

లోఓల్టేజీతో పనిచేయని పంపుసెట్లు | గొల్లపల్లిలో నెర్రెలు బారుతున్న వరిపొలాలు | నీటి తడులు అందక రైతుల అరిగోస

బెల్లంపల్లి: అన్నదాతకు కష్టాలు వచ్చాయి. ఓ పక్క ఎండలు మండిపోతుండగా మరోపక్క విద్యుత్ సమస్యలతో సరిపడా నీరందక పచ్చని పంటపొలాలు నిర్జీవంగా తయారవుతున్నాయి. నీటి తడులు అందక భూమి పొరలు నెర్రెలు బారుతున్నాయి. ఈ పరిణామాలతో రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధి నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామ రైతులు రబీలో వరి సేద్యానికి సిద్ధపడ్డారు. పుట్టెడాశతో నాట్లు వేసుకుని కంటికి రెప్పలాగా చూసుకుంటుండగా ఆకస్మికంగా చోటు చేసుకున్న పరిణామాల ప్రభావంతో పంట పొలాలు దయనీయంగా తయారయ్యాయి. బోర్ల ఆధారంగా దాదాపు 70ఎకరాల విస్తీర్ణంలో రైతులు పంట సాగు చేసి ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితులను చవి చూస్తున్నారు. ప్రతికూల పరిస్థితులతో రైతులు అరిగోస పడుతున్నారు.

లో ఓల్టేజీతో మోటార్లు పనిచేయక....

జోగాపూర్ శివారు ప్రాంతంలో మత్తడివాగు చెరువులో ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం భాగానే ఉన్నా కుడి కాలువకు మరమ్మతు చేయించకపోవడంతో సాగు నీరందడం లేదు. దీంతో బోర్లు వేసుకోవాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. 18మంది రైతులు బోర్లకు వ్యవసాయ కనెక్షన్‌లు తీసుకుని సేద్యం చేస్తుండగా, కొన్ని రోజుల నుంచి కరెంట్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ముఖ్యంగా త్రీఫేజ్ కరెంట్ సరఫరా కాక లోఓల్టేజీ తో రోజువారీగా మోటార్లు పనిచేయక పంట పొలాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం సాగుచేస్తున్న వరి పొలాలు చిరు పొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలోనే రోజువారీగా నీటి తడులు అందించాల్సి ఉండగా లోఓల్టేజీతో కరెంట్ కటకట ఏర్పడి చేతికందే పంట చేజారిపోయే పరిస్థితులు దాపురించాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు తీసుకు న్న రైతుల కోసం 100 కేవీ డీటీఆర్‌ను ఏర్పాటు చేశారు. అయితే వీరిలో కొందరు రైతులు అధిక హార్స్ పవర్ సామర్థ్యం కలిగిన విద్యుత్ మోటా ర్లు ఏర్పాటు చేసుకోవడంతో 100కేవీ డీటీఆర్‌పై భారం పడి లో ఓల్టేజీ సమస్య ఏర్పడటంతో మోటార్లు పనిచేయని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

పొలాలను పరిశీలించిన అధికారులు...

లో ఓల్టేజీ సమస్యతో ఎండిపోతున్న పంటలను, 100 కేవీ డీటీఆర్‌ను డిస్కం, వ్యవసాయ శాఖ అధికారులు శనివారం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. డిస్కం బెల్లంపల్లి డీఈ రాజన్న, ఏడీఈ రాంచందర్, ఏఈ మల్లయ్య, కమర్షియల్ ఏఏఈ శ్రీనివాస్, ఏఈఓ ప్రేమ్‌కుమార్ రైతుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండు, మూడు రోజుల వరకు నీటి తడులు అందించక పోతే పంట చేతికి అందే పరిస్థితులు ఉండవని రైతులు అధికారులతో ఆవేదన వ్యక్తం చేశారు. లో ఓల్టేజీ సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకుని పంటను కాపాడాలని వేడుకున్నారు.

రైతుల నిరసన

నెన్నెల: సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, డీడీలు చెల్లించి మూడు నెలలు కావస్తున్నా విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంలేదని మండలంలోని గొల్లపల్లి రైతులు శనివారం పొలాల్లో నిరసన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా 80 ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి 100 ఎకరాలకు నీరు అందించే సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యకు పరిష్కారం చూపనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పంట ఎండిపోతోంది



పంటకు నీటి సమస్య తీవ్రంగా ఉంది. మూడు నెలల నుంచి కరెంట్ సమస్యలు ఉంటున్నాయి. లో ఓల్టేజీ వల్ల పంపు మోటార్లు పనిచేయక వరికి నీటి కటకట ఏర్పడింది. కళ్ల ముందే పంట ఎండి పోతుండటంతో దుఃఖం ఆగడం లేదు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుని పంటను కాపాడాలి.

ఏగోలం సాయి , రైతు ,గొల్లపల్లి

మరో డీటీఆర్ ఏర్పాటు చేయాలి



నోటికొచ్చిన పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నాం. డీటీఆర్ సామర్థ్యానికి మించి మోటార్లు ఉండటంతో లో ఓల్టేజీ సమస్య వచ్చి పంపు మోటార్లు పనిచేయడం లేదంటున్న అధికారులు వెంటనే ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. అదనంగా మరో డీటీఆర్‌ను ఏర్పాటు చేయాలి. పంట పాడై పోకుండా కాపాడాలి.

- అంబిలపు ప్రశాంత్, రైతు ,గొల్లపల్లి

చర్యలు తీసుకుంటున్నాం..

లో ఓల్టేజీ సమస్యను అధిగమించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పంపు మోటారు వద్ద తప్పనిసరిగా కెపాసిటర్‌ను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించి బిగించే ఏర్పాట్లు చేశాం. కొంతమంది వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం డీడీ కట్టారు. వీరికి అదనంగా 25కేవీ డీటీఆర్‌ను మంజూరు చేయించి ఏర్పాటు చేయిస్తాం. దీంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు లో ఓల్టేజీ సమస్య ఏర్పడదని భావిస్తున్నాం.

- రాజన్న ,డిస్కం డీఈ ,బెల్లంపల్లి

గ్రంథాలయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

భీమారం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలోని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు తంగళ్లపల్లి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక యువకులతో కలిసి లైబ్రరీని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. 1977సంవత్సరంలో ఏర్పాటైన ఇక్కడి గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేవన్నారు. ఇప్పటివరకు కనీసం విద్యుత్ సదుపాయం కూడా కల్పించలేదని ఆరోపించారు. ఇరుకుగదిలో గ్రంథాలయం నడుస్తోందని, కనీసం ఇక్కడ పనిచేస్తున్న గ్రంథాలయ అధికారిని సంవత్సరం క్రితం బదిలీచేసిన అధికారులు ఇప్పటివరకు కొత్తవారిని నియమించలేదని పేర్కొన్నారు. గ్రంథాలయంలో కనీసం కుర్చీలు లేని దుస్థితి నెలకొందని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించి విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఇందులో సిరిపురం మధుకర్, మెండె మల్లేశ్, అర్కాల రమేష్, నూతి నాగరాజు, వేముల అరుణ్‌కుమార్ ఉన్నారు.

నీటి తొట్లు నిండాయి

సాక్షి ఎఫెక్ట్..

- పశువులకు అందుబాటులో తాగునీరు

నెన్నెల: మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ఉపాధిహామీ నిధులతో ఏర్పాటు చేసిన నీటి తొట్లను శనివారం పంచాయతీ అధికారులు నీటితో నింపారు. దీంతో పశువులకు తాగునీరు అందుబాటులోకి వచ్చింది. 'వృథాగా నీటి తొట్లు'అనే శీర్షికన ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఇంత కాలం వృథాగా ఉన్న నీటితొట్లను శుభ్రపర్చి నీటితో నింపి వినియోగంలోకి తెచ్చారు. కిలోమీటర్ల దూరంలో ఉన్న వాగులు, వంకలు, చెరువులకు వెళ్లి దాహార్తి తీర్చుకునే తిప్పలు తప్పాయన్నారు. పశువులకు తాగునీటి సౌకర్యం కల్పించేలా కృషి చేసిన 'సాక్షి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



నీటి తొట్టిలో దాహం తీర్చుకుంటున్న పశువు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..!



భీమారంలో జాతీయరహదారి పై ఇసుక

భీమారం: చెన్నూరు నుంచి భీమారం మండల కేంద్రం గుండా జాతీయ రహదారిపై హైదరాబాద్‌కు తరలిస్తున్న ఇసుకలారీలు ప్రమాణాలు పాటించకుండా ఇసుక తరలిస్తుండగా, ఇసుక రోడ్డుపై పడుతోంది. దీంతో దానిని తొలగించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇసుకపై టార్పాలిన్లు కప్పాలనే నిబంధన ఉన్నా, దానిని లారీల యజమానులు పాటించడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని జాతీయరహదారిపై పేరుకుపోయిన ఇసుకను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. లారీల యజమానులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పైపులు తెచ్చారు.. పనులు మరిచారు



కొత్తపల్లి ప్రధాన రోడ్డులో కల్వర్టు నిర్మించే స్థలం



కల్వర్టు నిర్మాణం కోసం తెచ్చిన పైపులు

భీమారం: మండల కేంద్రం నుంచి కొత్తపల్లి ప్రధాన రహదారిలో కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసిన అధికారులు సంవత్సరం కావస్తున్నా ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. వర్షాకాలంలో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా గత సంవత్సరం రోడ్డు మరమ్మతులతో పాటు బీటీ వేసే క్రమంలో దీనిని ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు వరద నీళ్లు తరలించేందుకు కల్వర్టు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కల్వర్టు నిర్మిస్తామని పైపులు కూడా తెప్పించారు. కల్వర్టు నిర్మాణం కోసం స్థలాన్ని గుర్తించి, అక్కడ బీటీ వేయకుండా వదిలారు. అయితే మిగితా చోట రోడ్డు నిర్మించి సంవత్సరం దాటుతున్నా, కల్వర్టు నిర్మాణం కోసం మాత్రం చర్యలు చేపట్టడం లేదు. వరదనీటితో రోడ్డుకు ప్రమాదం ఉందని గుర్తించిన అధికారులు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నూతన కార్యవర్గం

కోటపల్లి: మండలంలోని సిర్సా గ్రామంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి నితిన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గగ్గూరి రాజేశ్ అధ్యక్షుడిగా, పాక్కూరి శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నితిన్‌కుమార్ తెలిపారు.

పనులు ప్రారంభం

తాండూర్: మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీలో శనివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామంలోని మూడో వార్డులో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో చేపట్టిన పనులను ఎంపీటీసీ సిరంగి శంకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ కదారి రత్నాకర్ రావుతో కలిసి భూమిపూజ చేసి పనులు చేపట్టారు.

నారీ సేన ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రానికి చెందిన నారీ సేన ఆధ్వర్యంలో లక్సెట్టిపేట మండలం మన్నెగూడలోని మహిళలకు 200మందికి శనివారం చీరలు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు అవసరమైన సరుకులను అందించారు. కార్యక్రమంలో నారీసేన చార్టర్ ప్రెసిడెంట్ శివకీర్తి, నారీసేన చార్టర్ అధ్యక్షురాలు రోహిణి, జనరల్ సెక్రటరీ బాలముక్త, జాయింట్ సెక్రటరీ పుష్ప, వైస్ ప్రసిడెంట్ మాధవి, లీగల్ అడ్వైజర్ పేరం అలేఖ్య, ట్రెజరర్ జ్యోతి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఏరియాలతో పాటు లక్ష్మీనగర్, హైటెక్ సిటీలలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి ఉదయం 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీసీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఏ ర్పడునని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వేమనపల్లిలో...

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఏఈ దీక్షిత్ తెలి పారు. ఈ కారణంగా మండలంలోని నీల్వా యి, మామడ, కల్మలపేట, కేతన్‌పల్లి, ము ల్కలపేట, రాచర్ల, గొర్లపల్లి, కొత్తపల్లి, దస్నాపూర్, మంగెనపల్లి, రాజారాం, వేమనపల్లి, ఒడ్డుగూడం, సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడం, కల్లంపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఏబీఏపీ సదస్సు

శ్రీరాంపూర్: ఈ నెల 10న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కార్తికేయన్ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్లో ఉదయం 10:30గంటలకు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) సదస్సు, జనరల్ బాడీ సమావేశం జరగనుందని సభ జిల్లా అధ్యక్షుడు కొండ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి మట్టపల్లి సంపత్ రావు, పీఆర్‌ఏ భాస్కరీ రాజేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమలరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు, జనరల్ బాడీ సమావేశానికి సభ్యులంతా హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

వెలగని వీధి దీపాలు..!



నెన్నెల: నాలుగు కూడళ్ల మధ్య ఏర్పాటు చేసిన హైమాస్ట్‌లైట్లు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. రాత్రైందంటే చాలు వెలుగులు పంచాల్సిన దీపాలు అంధకారంలో మగ్గుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అవి నిరుపయోగంగా మారాయి. ఎంతో ఆర్భాటంగా డీఎంఎఫ్‌టీ నిధులతో లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ దీపాలు మూడునాళ్ల ముచ్చటగానే మారాయని ప్రజలు అంటున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వారి అభివద్ధి నిధుల నుంచి గ్రామాల్లో హైమాస్ట్ దీపాలు బిగించారు. ఆ తర్వాత ఐదు, ఆరు నెలలకే అవి వెలగడం లేదు. తర్వాత వాటి గురించి గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మండలంలో సుమారు 60కి పైగా హైమాస్ట్ దీపాలు బిగించారు. వీటిలో సుమారు 30వరకు కూడా నిత్యం వెలుగులను ఇవ్వడం లేదు. పనిచేయని దీపాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చడం లేదు. హైమాస్ట్ దీపాలు ఖరీదుతో కూడుకున్నది కావడంతో, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రిపూట దీపాలు వెలగక గ్రామ ప్రధాన కూడళ్లలో అంధకారం అలుముకుంటుందని మండల వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా వాటిని వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

ఘనంగా పావురాజేశ్వరుడి జాతర

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు

దండేపల్లి: మండలంలోని పెద్దపేట సమీపంలో గల పావురాజేశ్వరస్వామి(పావురాయుడు) ఆలయం వద్ద శనివారం నిర్వహించిన జాతర ఘనంగా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏటా మహాశివరాత్రి తెల్లారి ఇక్కడ జాతర నిర్వహిస్తుంటారు. భక్తులు రాజేశ్వరస్వామికి బోనాలు వండి సమర్పించడంతో పాటు, నిలువెత్తు బంగారం(బెల్లం)ను తులాభారంగా సమర్పించారు. మరికొందరు తమ పిల్లలకు పుట్టు వెంట్రుకలు తీశారు. ధ్వజస్తంభం వద్ద, ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. శివసత్తులు పూనకాలతో హోరెత్తించారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాల్లో రకరకాల దుకాణాలు వెలిశాయి.

మందల మల్లన్నకు నాగవెల్లి పట్నాలు



పట్నాలు వేస్తున్న పూజారులు

నెన్నెల: మండలంలోని కోణంపేట, ఖర్జీ మధ్యలోని అటవీ ప్రాంతంలో గుడిచింతల మందల మల్లన్న దేవాలయంలో శనివారం నాగవెల్లి పట్నాల ఉత్సవాలు ఒగ్గు పూజారి ఏనుగుల శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివరాత్రికి ప్రారంభమైన జాతర శనివారం నాగవెల్లి ఉత్సవంతో ముగిసింది. మల్లికార్జున స్వామి, భ్రమరాంబకు పట్టువస్త్రాలు సమర్పించి పసుపు, కుంకుమ, బియ్యంతో ఆలయం ముందు పట్నాలు, ముగ్గులు వేసి ఒగ్గు పూజారులు డోలు డమరుకాలతో ప్రత్యేక పూజలు చేశారు. మల్లన్న స్వామి చరిత్రను ఒగ్గు కళాకారులు భక్తులకు వినిపించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. నాగవెల్లి అనంతరం పెద్ద ఎత్తున మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న నర్సింగరావు దంపతులు

జన్నారం: మండలకేంద్రంలోని ఈర్లగుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని శనివారం శివపార్వతుల కల్యాణాన్ని మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పురోహితులు భూమన్న స్వామి మంత్రోశ్చరణలు, భాజాభజంత్రీల మధ్య వైభవంగా కల్యాణం జరిపించారు. ఏటా మహా శివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కల్యాణం జరిపిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు, ఉపాధ్యక్షుడు చిలువేరు నర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో మహేంద్ర సంఘ నాయకులు సూరినేని కొండయ్య, కొడుజుట్టు రాజన్న, పిల్ల నర్సయ్య, మల్లయ్య, కనకయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కిటకిటలాడిన 'కత్తెరసాల'



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాలలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో జాతర కొనసాగుతుంది. భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. బోనాలు పోసి, తీపి పదార్థాలతో భక్తులు స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి, స్వామి వారికి బండారు వేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అన్న సంతార్పణ చేశారు. ఆలయ ఆవరణలో శివసత్తులు పూనకాలతో ఊగి పోయారు.

ఘనంగా రథోత్సవం



దేవతామూర్తులతో రథోత్సవం

మంచిర్యాలఅర్బన్: పట్టణంలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలతో శనివారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. స్థానిక విశ్వనాథ ఆలయంలో ఈ నెల 6న వేంకటశ్వర స్వామి కల్యాణం, శుక్రవారం రాత్రి మహా శివ రాత్రి వేడుకలలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలతో పట్టణ పుర వీధులా మీదుగా రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ముక్తారవి, ఆలయ అర్చకులు నరహరిశర్మ, భట్టాచార్యులు, బాలక్రిష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

దండేపల్లి: జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద ఆటో బోల్తాపడి దండేపల్లి మండలం మేదరిపేటకు చెందిన 11మంది గాయపడ్డారు. వారిని జగిత్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేర్పించడంతో, వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఫోన్ ద్వారా ఆసుపత్రి వైద్యులను కోరారు. క్షతగాత్రులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు త్రిమూర్తి, మేదరిపేట ఎంపీటీసీ నవీన్, నాయకులు రాజేష్, శ్రీనివాస్, రాకేష్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన నల్లెల మల్లయ్య అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. వైద్య ఖర్చులకు ఇబ్బంది పడటంతో అతడి వైద్య ఖర్చులకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రూ.2లక్షల ఎల్‌వోసీని శనివారం అందించారు.